తెలుగు దినపత్రిక

సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

18-07-2026

శనివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 160

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575



ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్

- గత భూ లావాదేవీలన్నింటిపై ప్రత్యేక దర్యాప్తు
- బాధ్యుల గుర్తింపు, బాధితులకు న్యాయం లక్ష్యమన్న ప్రభుత్వం
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పులకు కేబినెట్ ఆమోదం 2
- పంచాయతీరాజ్ చట్ట సవరణలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు గ్రీన్ సిగ్నల్



అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభం!

- హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చిన కేంద్రం
- 75 స్టేషన్లను వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ. 25వేల కోట్లతో మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- హైటెక్ సిటీ స్టేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

హైదరాబాద్, జూలై 17 (సిరి న్యూస్):

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మక అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 75 రైల్వే స్టేషన్లను శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా తెలంగాణలోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఆధునిక

మిగతా 2వ పేజీలో..

కోర్టు మొట్టికాయలతో దిగొచ్చిన సర్కారు!

- రైతుకు దక్కిన రిఫండ్ డబ్బులు
- ఐదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగిన బాధితుడు
- ధిక్కరణ కేసుతో కదిలిన యంత్రాంగం
- నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

హైదరాబాద్, జూలై 17 (సిరి న్యూస్):

ప్రభుత్వ కార్యాలయాలు, ధరణి పోర్టల్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా ఒక రైతు ఐదేళ్ల పాటు చేసిన న్యాయపోరాటం నిలిచింది. స్లాట్ రద్దు చేసుకున్న రైతుకు తిరిగి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ డబ్బుల కోసం హైకోర్టును ఆశ్రయించాల్సి రావడం, చివరికి కోర్టు ధిక్కరణ కేసు నమోదు

మిగతా 2వ పేజీలో..





ఢిల్లీ గడ్డపై చారిత్రక పోరాటం..!

- 19 రోజులుగా సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష..
- లడఖ్ హక్కులతో పాటు నీట్ లీకేజీపై సమరం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్
- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రముఖ పర్యావరణవేత్త పోరాటం
- కేవలం ఉప్పు నీటితో 19 రోజులుగా ఉపవాసం..
- 9 కిలోల బరువు తగ్గి 57 కిలోలకు పడిపోయిన శరీర బరువు
- 20న జరిగే పార్లమెంట్ మార్చ్ వరకు దీక్ష విరమించేది లేదు: వాంగ్‌చుక్

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

ప్రముఖ పర్యావరణవేత్త, విద్యా సంస్కర్త, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత అయిన సోనమ్ వాంగ్‌చుక్ దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఒక చారిత్రాత్మక పోరాటానికి నాయకత్వం వహిస్తున్నారు. 'ఐస్ స్తూప' కృత్రిమ హిమానీనదాల ఆవిష్కరణతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది, ''3 ఇడియట్స్'' సినిమాలోని కథానాయకుడి పాత్రకు నిజజీవిత స్ఫూర్తిగా నిలిచిన వాంగ్‌చుక్, ప్రస్తుతం ప్రాంతీయ స్వయంప్రతిపత్తి, ప్రజాస్వామ్య హక్కులు, జాతీయ విద్యా సంస్కరణల

మిగతా 3వ పేజీలో..



ప్రభుత్వోద్యోగులకు మహా భరోసా

- అట్టహాసంగా న్యూ హెల్త్ స్కీమ్ ప్రారంభం 3
- 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపయుక్తం
- సీజీహెచ్ఎస్ ప్యాకేజీల కింద 1,816 రకాల చికిత్సలు
- పథకాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్



విద్య, వైద్యంపై ఖర్చు రాష్ట్ర ప్రగతికి పెట్టుబడి

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- 24వేలకు పైగా పడకల సామర్థ్యంతో అగ్రగామిగా వైద్య రంగం 3
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం

- 'రోహిత్ వేముల చట్టం' ముసాయిదాపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం 3



త్వరలో మరో 50 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు

ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం: మంత్రి సీతక్క

నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్

పదేళ్ల పాలనలో ఉద్యోగాల భర్తీలో విఫలమైందని విమర్శ

అసత్య ప్రచారాలను నమ్మొద్దని నిరుద్యోగులకు సూచన

హైదరాబాద్, జూలై 17, సిరి న్యూస్ :

తెలంగాణలో ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యలపై రాజకీయ సెగలు రాజుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల నిరంకుశ పాలనలో

మిగతా 2వ పేజీలో..

నామినేటెడ్ పదవుల భర్తీలో ఆలస్యం

కార్పొరేషన్ల చైర్మన్ల పునర్నియామకంపై ఉత్కంఠ 2

వాయిదాపై పీసీసీ తీరుపై కొందరు నేతల విమర్శలు

పనిచేసిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ ఆలోచన

సీఎం, పీసీసీ చీఫ్ భేటీ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం






రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ల్యాబ్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు

2

- ఎరువుల నాణ్యతపై రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో దోహదం
- ఈ గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణం : మంత్రి తుమ్మల

డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కుమారుడి విచారణ

- డ్రగ్స్ సరఫరాదారుల కాంటాక్ట్ లిస్టులో పేరు ఉండటంతో విచారణ
- వైద్య పరీక్షల అనంతరం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం
- ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి 2





ఓటర్ల జాబితా సవరణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి

గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పురోగతి 2

పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర డిజిటలైజేషన్

ప్రత్యేక సవరణ శిబిరాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్

గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కుమారుడి విచారణ

హైదరాబాద్, జూలై 17, సిరి న్యూస్

డ్రగ్స్ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ ఐఏఎస్ అధికారి కె. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డిని మంగళహాట్ పోలీసులు విచారణకు పిలిచారు. డ్రగ్స్ సరఫరాదారుల కాంటాక్ట్ లిస్టులో అతడి పేరు ఉన్నట్లు గుర్తించడంతో విచారణ చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల చర్యలు

విచారణ సందర్భంగా భరత్ రాజ్ రెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పరీక్షల అనంతరం మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన చట్టంలోని నిబంధనల ప్రకారం అతడికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అలాగే స్వచ్ఛందంగా మాదకద్రవ్యాల విముక్తి కేంద్రంలో చికిత్స పొందేందుకు ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది.

ఆరోపణలు నిరాధారమన్న వెంకట్రామ్ రెడ్డి

ఈ వ్యవహారంపై ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి స్పందిస్తూ, తన కుమారుడిని అరెస్టు చేశారన్న వార్తలను పూర్తిగా ఖండించారు. డ్రగ్స్ వినియోగించాడన్న ప్రచారం కూడా వాస్తవం కాదని పేర్కొన్నారు. పోలీసులు కేవలం ప్రాథమిక విచారణలో భాగంగా మాత్రమే వివరాలు సేకరించారని, ఎలాంటి నిర్ధారణకు వచ్చే ఆధారాలు లభించలేదని ఆయన వెల్లడించారు.

దర్యాప్తు ముమ్మరం

రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ఈ కేసును కూడా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌తో ఉన్న సంబంధాలు, ఇతర అనుమానితుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. పూర్తి దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి



అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభం!

మొదటిపేజీ తరువాయి

హంగులతో కొత్తరూపు సంతరించుకుంది. హైటెక్ సిటీ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో రైల్వే వ్యవస్థ భారీగా రూపాంతరం చెందిందని, తెలంగాణలో రూ. 40వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, హైటెక్ సిటీ స్టేషన్‌లో అత్యాధునిక వెయిటింగ్ హాల్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు మరియు దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. మరోవైపు, హర్యానాలోని జింద్ నుండి దేశపు తొలి హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇది పూర్తిగా కాలుష్య రహితమని, 'మేక్ ఇన్ ఇండియా'లో ఇదొక అద్భుత విజయమని ఆయన పేర్కొన్నారు.

ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్

హైదరాబాద్, జూలై 17, సిరి న్యూస్ :

గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణి పోర్టల్‌లో జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ప్రత్యేక దర్యాప్తు బృందంతో పరిశీలించి, అవకతవకలకు బాధ్యులైన వారిని గుర్తించాలని కేబినెట్ ఆదేశించింది. భూ రికార్డుల్లో జరిగిన అక్రమాలను వెలికితీసి బాధితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసింది.

భూ లావాదేవీలపై ప్రత్యేక విచారణ

ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ప్రతి భూ లావాదేవీని ఫోరెన్సిక్ స్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ రికార్డుల్లో మార్పులు, అక్రమ బదిలీలు, ఇతర అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ప్రత్యేక బృందానికి బాధ్యతలు అప్పగించనుంది. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేసే చర్యలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇతర కీలక నిర్ణయాలు

కేబినెట్ సమావేశంలో హైదరాబాద్ ముంబై, హైదరాబాద్ బెంగళూరు బుల్లెట్ ట్రైన్ కారిడార్ల అలైన్‌మెంట్‌లో మార్పులకు కూడా ఆమోదం లభించింది. భూ సేకరణ వ్యయాన్ని తగ్గిస్తూ ప్రజలకు అనుకూలంగా స్టేషన్లను అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పెండింగ్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అర్హులకు కేటాయించాలని నిర్ణయించారు. జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చారు. అలాగే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణలకు కేబినెట్ ఆమోదం తెలిపి, సంబంధిత బిల్లును రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.

త్వరలో మరో 50 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను నిలువునా ముంచిందని, యువత జీవితాలతో ఆడుకుందని ఆమె ఆరోపించారు. ఒకప్పుడు నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిన రాష్ట్రంలో, గత ప్రభుత్వం కేవలం స్వలాభం కోసమే పనిచేసిందని విమర్శించారు. పదేళ్ల సుదీర్ఘ కాలంలో బీఆర్ఎస్ కనీసం లక్ష ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయిందని, నోటిఫికేషన్ల పేరిట కాలయాపన చేస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఉపాధి అవకాశాలను కూడా తెలంగాణ సిద్ధించిన తర్వాత యువతకు దక్కకుండా చేశారని దుయ్యబట్టారు. అయితే.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుద్యోగుల సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే పారదర్శకంగా, ఎక్కడా కోర్టు వివాదాలు లేకుండా ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపామని ఆమె వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, దీనిలో భాగంగానే త్వరలోనే మరో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన సరికొత్త నోటిఫికేషన్‌లను విడుదల చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని ప్రకటించారు. నిరుద్యోగులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాల విప్లవాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నిరుద్యోగ యువత నమ్మవద్దని, ప్రభుత్వంపై నమ్మకంతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు

నామినేటెడ్ పదవుల భర్తీలో ఆలస్యం

హైదరాబాద్, జూలై 17, సిరి న్యూస్

తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల భర్తీ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. చాలా కాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకులు ఈసారి అవకాశం దక్కుతుందనే ఆశతో ఉండగా, భర్తీ ప్రక్రియలో కొనసాగుతున్న జాప్యంపై పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఇటీవల 37 కార్పొరేషన్ల చైర్మన్ల పదవీకాలం ముగియడంతో వారిని తిరిగి కొనసాగిస్తారా, కొత్త వారికి అవకాశం కల్పిస్తారా అనే అంశం కూడా ఆసక్తికరంగా మారింది.

ఆలస్యానికి కారణాలపై భిన్నాభిప్రాయాలు

నామినేటెడ్ పదవుల భర్తీ పదేపదే వాయిదా పడుతుండటంపై కాంగ్రెస్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ తరపున సమర్థవంతమైన సమన్వయం జరగకపోవడం వల్లే ప్రక్రియ ఆలస్యమైందని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ నుంచి ఆశించిన స్థాయిలో ఫాలోఅప్ లేకపోవడం కూడా ఇందుకు కారణమనే ప్రచారం గాంధీభవన్ వర్గాల్లో వినిపిస్తోంది. కార్పొరేషన్ చైర్మన్ల పునర్నియామకాల విషయంలోనూ స్పష్టత లేకపోవడం నాయకుల్లో అసంతృప్తిని పెంచుతోందని చెబుతున్నారు.

పనితీరే ప్రామాణికం

ఈ విమర్శలను పీసీసీ వర్గాలు తిరస్కరిస్తున్నాయి. అందరికీ పునర్నియామకం సాధ్యం కాదని, పార్టీ కోసం చురుకుగా పనిచేసిన వారికే మరోసారి అవకాశం కల్పించే విధానాన్ని అనుసరించనున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ఇదే విషయాన్ని ముందుగానే చెప్పడంతో కొందరు అసంతృప్తితో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పనితీరును ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలనే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం.

ముందుగా కొత్తవారికి అవకాశం

కార్పొరేషన్ల చైర్మన్ల నియామకంలో సామాజిక సమతుల్యత, రాజకీయ ప్రాధాన్యత, పార్టీ సేవలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుగా కొత్త నాయకులకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం పునర్నియామకాల అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

త్వరలోనే నిర్ణయంపై స్పష్టత

ఈ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ భేటీ అనంతరం నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలు, పునర్నియామకాలపై తుది నిర్ణయం వెలువడే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడి చాలా కాలం గడిచినా నామినేటెడ్ పదవులు పూర్తిగా భర్తీ కాకపోవడంతో, ఇకపై ఆలస్యం చేయకుండా పెండింగ్‌లో ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.

ఓటర్ల జాబితా సవరణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి

సంగారెడ్డి, జూలై 17, సిరి న్యూస్

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సవరణ శిబిరాల పరిశీలన

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు చేపడుతున్న పనితీరును పరిశీలించి, నమోదు ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు.

రాజకీయ పార్టీలతో సమన్వయం

శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడారు. పార్టీ ప్రతినిధులకు అధికారిక గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అనే అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓల సమన్వయంతో సవరణ ప్రక్రియ కొనసాగడం సానుకూల పరిణామమని ఆయన పేర్కొన్నారు.

వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు

ప్రత్యేక సవరణకు ప్రభుత్వం పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకుని ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎక్కడైనా కొరతగా ఉంటే, వెంటనే సంబంధిత సూపర్‌వైజర్ల నుంచి సేకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మైనర్‌తో అసభ్య ప్రవర్తన

- **సీసీటీవీలో చూసి దాడి చేసిన స్థానికులు, కుటుంబసభ్యులు**
- **ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిందితుడి మృతి**
- **దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు**

హైదరాబాద్, జూలై 17, సిరి న్యూస్

హైదరాబాద్‌లోని కుల్సుంపురలో మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణల నేపథ్యంలో ఓ వ్యక్తిపై స్థానికులు, బాలిక కుటుంబసభ్యులు దాడి చేసిన ఘటన విషాదాంతమైంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీసీటీవీలో ఘటన వెలుగులోకి

పోలీసుల వివరాల ప్రకారం, కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని డబుల్ బెడ్రూం సముదాయంలో నివసించే అబ్దుల్ అజీజ్ నిలోఫర్ ఆసుపత్రి సమీపంలో టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికతో అతడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన అక్కడి సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

దాడిలో తీవ్రంగా గాయాలు

సీసీటీవీ దృశ్యాలను చూసిన బాలిక కుటుంబసభ్యులు, స్థానికులు ఆగ్రహంతో అబ్దుల్ అజీజ్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



పోలీసుల దర్యాప్తు

ఈ ఘటనపై కుల్సుంపుర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బాలికపై జరిగిన ఆరోపణలతో పాటు దాడి ఘటనపైనా అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

కోర్టు మొట్టికాయలతో దిగొచ్చిన సర్కారు!

మొదటిపేజీ తరువాయి

కావడంతో ప్రభుత్వం దిగివచ్చి డబ్బులు చెల్లించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఒక రైతు 2021 జూలైలో ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నారు. అనివార్య కారణాల వల్ల ఆ స్లాట్‌ను రద్దు చేసుకున్నప్పటికీ, ఆయన చెల్లించిన రూ. 1,38,921 స్టాంప్ డ్యూటీ రిఫండ్ మాత్రం నాలుగేళ్లు దాటినా రాలేదు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో, విసిగిపోయిన రైతు 2025లో అడ్వొకేట్ గుమ్మి రాజ్ కుమార్ రెడ్డి ద్వారా హైకోర్టును ఆశ్రయించారు.

కోర్టు ఆదేశాలు.. ప్రభుత్వ నిర్లక్ష్యం:

వాదనలు విన్న హైకోర్టు, 2025 జూలైలో నాలుగు వారాల్లోపు డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ బిల్లును ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపినప్పటికీ, సెక్రటరీ అప్రూవ్ చేయలేదు. దీంతో రైతు మళ్లీ ఫైనాన్స్ సెక్రటరీపై కోర్టు ధిక్కరణ కేసు వేశారు. కోర్టు పలుమార్లు హెచ్చరించినా ప్రభుత్వం వాయిదాలు కోరుతూ కాలయాపన చేసింది. చివరికి 2026 జూన్ 19న ఇచ్చిన గడువులోగా చెల్లించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని కోర్టు స్పష్టం చేయడంతో, ఎట్టకేలకు జూలై 17న ప్రభుత్వం బాధితుడికి రిఫండ్ మొత్తాన్ని చెల్లించింది. రాష్ట్రవ్యాప్తంగా 34 వేల మంది బాధితులు

కేవలం ఈ రైతు మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ధరణి/భూ భారతి పోర్టల్ ద్వారా స్లాట్లు క్యాన్సిల్ చేసుకున్న సుమారు 34,314 మంది రైతులకు ప్రభుత్వం దాదాపు రూ. 129 కోట్లకు పైగా డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఐదేళ్లుగా రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కోర్టుకు వెళ్తే తప్ప సామాన్యులకు న్యాయం జరగని దుస్థితిలో వ్యవస్థ ఉందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న అందరి రిఫండ్ డబ్బులను త్వరితగతిన చెల్లించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ల్యాబ్‌కు ఎన్‌ఏబీఎల్ గుర్తింపు

హైదరాబాద్, జూలై 16, సిరి న్యూస్:

రాష్ట్ర వ్యవసాయ శాఖ మరో ప్రతిష్ఠాత్మక విజయాన్ని సాధించింది. రాజేంద్రనగర్‌లోని ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు ప్రయోగశాల (ఎఫ్‌సీవో) కు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు లభించింది. ఈ ప్రయోగశాల ఐఎస్‌ఓ/ఐఈసీ 17025:2017 ప్రమాణాలను విజయవంతంగా అమలు చేసి ఎరువుల రసాయన విశ్లేషణలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించింది. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న తొమ్మిది నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలు (ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు)లో రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాలే తొలిసారిగా ఈ గుర్తింపు పొందినదిగా నిలిచింది. ఈ ప్రయోగశాలలో ప్రస్తుతం మ్యూరియేట్ ఆఫ్ పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ పౌడర్, గ్రాన్యులర్) ఎరువుల నాణ్యత పరీక్షలకు గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖకు గర్వకారణం. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది. అలాగే ఎరువుల నాణ్యతపై రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, రాష్ట్రంలో నాణ్యత నియంత్రణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంలో ఈ గుర్తింపు కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రయోగశాలకు లభించిన గుర్తింపు రాష్ట్రంలోని ఇతర వ్యవసాయ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలకు కూడా దశలవారీగా కల్పించే ప్రక్రియకు నాంది పలికింది. ఈ సందర్భంగా గుర్తింపు పత్రం గురించి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకువివరించారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి వ్యవసాయ శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాలకు గుర్తింపు లభించడం రాష్ట్ర వ్యవసాయ శాఖకు గర్వకారణమని అన్నారు.



మంత్రులతో ఇరాన్ ప్రతినిధి బృందం భేటీ

ఇరాన్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సచివాలయంలో సమావేశమయ్యారు. ఇరాన్ సహకార, కార్మిక, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి హెచఈ డాక్టర్ మెయిదరి, డాక్టర్ సార్ఫి, సహకార శాఖ ఉప మంత్రి, భారత్‌లోని ఇరాన్ రాయబారి హెచ్ఈ డాక్టర్ మహమ్మద్ ఫాత్ అలీ, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ హెచ్ఈ హమీద్ అహ్మదియే, వైస్ కాన్సుల్ మొహ్సిన్ మొఘద్దమి, ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హాషెమి మంత్రులను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో సహకార ఉద్యమం బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరు, సభ్యత్వ విస్తరణ, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతిని మంత్రి తుమ్మల ఆ□ బృందానికి వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతంలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సహకార విధానాలు, సంస్థాగత సంస్కరణలు, సభ్యులకు అందిస్తున్న సేవలపై ఇరాన్ ప్రతినిధి బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో సహకార రంగంలో పరస్పర అనుభవాల మార్పిడి, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపై ఇరు పక్షాలు చర్చించాయి. అనంతరం మంత్రులు తుమ్మల, వివేక్‌లు ఇరాన్ ప్రతినిధి బృంద సభ్యులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ప్రతినిధి బృందం కూడా మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.

ప్రభుత్వోద్యోగులకు మహా భరోసా

హైదరాబాద్, సిరి న్యూస్

ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చేది కాంగ్రెస్ సర్కారే

మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. పేదలకు అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి ఏపీలో ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో ఉద్యోగులు, పెన్షనర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతమైన, సుస్థిరమైన, పారదర్శకమైన న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. గతంలో అమలులో ఉన్న హెల్త్ స్కీమ్‌లో ప్యాకేజీ రేట్లు తక్కువగా ఉండటంతో అనేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ భాగస్వామ్యం కావడం లేదని, క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం, ఉద్యోగుల ప్రాతినిధ్యం లేకపోవడం, ప్యాకేజీల సవరణలో పరిమితులు వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. వాటన్నింటికీ శాశ్వత పరిష్కారంగా ఈ కొత్త పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ స్కీమ్ అమలులో ఉద్యోగులు, పెన్షనర్ల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కంట్రిబ్యూట్ చేస్తుందని, ప్రతి పైసాను ఈహెచ్ఎస్ అమలు కోసమే వినియోగిస్తామని మంత్రి స్పష్టం



చేశారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కామినేని, కాంటినెంటల్, కేర్, స్టార్, బసవతారకం వంటి ప్రముఖ కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో కూడా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు అత్యాధునిక వైద్య సేవలు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. ఈ పథకంలో భాగస్వామ్యమైన అన్ని హాస్పిటళ్ల యాజమాన్యాలు, డాక్టర్లకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. ట్రస్టులో ప్రభుత్వం తరఫున 17 మంది, ఉద్యోగుల తరఫున 10 మంది, పెన్షనర్ల తరఫున ముగ్గురు సభ్యులు ఉండటం వల్ల ఉద్యోగుల భాగస్వామ్యంతో పారదర్శకంగా పథకం అమలవుతుందని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ డిజిటల్ హెల్త్ కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ప్రీఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు మొత్తం ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో వెల్‌నెస్ సెంటర్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రతిరోజూ సుమారు 1,800 మందికి ఔట్ పేషెంట్ సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతీ కేంద్రంలో ఎంబీబీఎస్, స్పెషలిస్ట్ డాక్టర్లు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ల్యాబ్ పరీక్షలు, బ్రాండెడ్ మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వెల్‌నెస్ సెంటర్లు లేని 24 జిల్లాల్లో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఈ సేవలను మరింత విస్తరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ సభ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పెన్షనర్ల సంఘాల నాయకులు, నెట్‌వర్క్ హాస్పిటల్స్ ప్రతినిధులు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం : డిప్యూటీ సీఎంకు ఉద్యోగుల కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్య కార్డుల అమలుకు శ్రీకారం చుట్టడం పట్ల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన, నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక చొరవ తీసుకుని ఆరోగ్య కార్డుల అమలును వేగవంతం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ చైర్మన్ లచ్చిరెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఈహెచ్‌సీటీ ట్రస్ట్ మెంబర్ దేవరకొండ సైదులు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.పోచయ్య, ఎస్‌టీయు□ రాష్ట్ర అధ్యక్షుడు, ఈహెచ్‌సీటీ ట్రస్ట్ మెంబర్ సదానందం గౌడ్, పెన్షనర్ల అసోసియేషన్ చైర్‌పర్సన్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆదర్శప్రాయమని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగులు, పెన్షనర్ల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

విద్య, వైద్యంపై ఖర్చు
రాష్ట్ర ప్రగతికి పెట్టుబడి

హైదరాబాద్, జూలై 17, సిరి న్యూస్:

వైద్యం, విద్యారంగాలపై ప్రభుత్వం పెట్టే ఖర్చు ఉచిత సంక్షేమం మాత్రమే కాదని, అది మన రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచేందుకు మానవ వనరులపై పెట్టే దీర్ఘకాలిక పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన 247 మంది నర్సింగ్ ఆఫీసర్లకు సేవాలాల్ భవన్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి నియామక పత్రాలను ఆయన శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కార్మికుల హక్కులు, కనీస వేతనాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గతంలో ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో ఉన్నప్పుడు ప్రతి బడ్జెట్ సమావేశంలోనూ కనీస వేతనాల సవరణ గురించి నిలదీశానని, కానీ నాటి ప్రభుత్వం ఏనాడూ సరైన సమాధానం ఇవ్వలేదని గుర్తుచేశారు. అయితే, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రత్యేక దృష్టి సారించి దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను సాధించి జీవోలను విడుదల చేశారని ప్రశంసించారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో మందుల కొరత ఉండకుండా పేదలకు సక్రమంగా మందులు పంపిణీ జరగడానికి మంత్రి వివేక్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని గ్రీన్ ఛానల్‌లో రూ.30 కోట్లు విడుదల చేయడానికి వెసలుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈఎస్ఐ హాస్పిటల్స్‌లో అధునాతన డయాలసిస్ యూనిట్లు, సీటీ స్కాన్ సౌకర్యాలు, బర్న్స్ వార్డులు, కార్డియాక్ కేర్ సెంటర్లను వేగంగా ఏర్పాటు చేసి ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అదనంగా 120మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఆరుగురు డెంటల్ సివిల్ సర్జన్లు, 99 మంది ఫార్మసిస్టులు, 34 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 54 మంది ఏఎన్ఎంలు, ఇతర పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయబోతున్నట్లు తెలిపారు. సనత్ నగర్ ఈఎస్ఐతోపాటు ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్‌లలో మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణాలను వేగవంతం చేయడానికి ప్రతి నెలా నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. నిమ్స్ విస్తరణ పనులకు సైతం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ దాదాపు 44,029 పడకల సామర్థ్యంతో దేశంలోనే అత్యధిక సగటు పడకలు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ద్వారా దాదాపు 75 లక్షల మందికి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఉన్న 16 మెడికల్ కాలేజీలకు అదనంగా నూతనంగా 9 మెడికల్ కాలేజీలను, 16 నర్సింగ్ కాలేజీలను, 28 పారామెడికల్ కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, హైదరాబాదులో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అత్యాధునిక కంప్యూటరైజ్డ్ మిషనరీతో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్ కామ్ ద్వారా శిక్షణ పొందే విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ప్రతి నెలా రూ.2,000 స్టైఫండ్ అందిస్తూ ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. నూతనంగా నియామక పత్రాలు అందుకున్న నర్సింగ్ అధికారులను అభినందిస్తూ నర్సింగ్ అనేది ఉద్యోగం మాత్రమే కాదని, అది ఆపదలో ఉన్న దీన జనులకు ప్రేమతో సేవలు అందించే ఒక పవిత్రమైన సేవ అని అన్నారు.

ఢిల్లీ గడ్డపై చారిత్రక పోరాటం..!

మొదటిపేజీ తరువాయి

కోసం ప్రాణాలకు తెగించి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. లడఖ్ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు, దేశ విద్యావ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలంటూ ఒక పర్యావరణవేత్త ఢిల్లీ నడిబొడ్డున చేస్తున్న ఈ పోరాటం ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

వివాదానికి మూలం.. లడఖ్ ఉద్యమం

ఈ సుదీర్ఘ కథ 2019లో ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూ కాశ్మీర్‌ను విభజించి, లడఖ్‌ను అసెంబ్లీ లేని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చింది. మొదట్లో స్థానికులు సంతోషించినప్పటికీ, పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కోల్పోవడం వల్ల తమ భూములు, ఉద్యోగాలపై నియంత్రణ కోల్పోయామని త్వరగతినే గ్రహించారు. స్థానిక ప్రభుత్వం లేకపోవడంతో లడఖ్ యొక్క సున్నితమైన హిమాలయ పర్యావరణాన్ని ప్రమాదంలో పడేసేలా భారీ పారిశ్రామిక, మైనింగ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం మొదలైంది. తమ మాతృభూమిని రక్షించుకోవడానికి 'లే అపెక్స్ బాడీ', 'కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్' చేతులు కలిపాయి. రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ కింద లడఖ్‌ను చేర్చడం, ప్రత్యేక రాష్ట్ర హోదా, స్థానిక యువతకు ఉద్యోగాల రక్షణ, లే మరియు కార్గిల్‌కు విడివిడిగా పార్లమెంటరీ స్థానాలు కల్పించాలనే 4 ప్రధాన డిమాండ్లతో వాంగ్‌చుక్ ఉద్యమ బాట పట్టారు.

జైలు జీవితం.. అయినా తగ్గని పోరాటం

ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడానికి వాంగ్‌చుక్ అహింసా మార్గాన్ని ఎంచుకుని 2023, 2024



మరియు 2025 ప్రారంభంలో మైనస్ డిగ్రీల తీవ్రమైన చలిలో పలుమార్లు సుదీర్ఘ పర్యావరణ నిరాహార దీక్షలు చేశారు. అయితే, లడఖ్‌లో జరిగిన ఒక నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారడంతో ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి వాంగ్‌చుక్‌ను అరెస్ట్ చేసి, కఠినమైన జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేసి జైల్లో పెట్టింది. దాదాపు 170 రోజుల సుదీర్ఘ జైలు జీవితం తర్వాత, 2026 మార్చిలో కోర్టు ఆదేశాల ద్వారా వాంగ్‌చుక్ విడుదలయ్యారు. జైలు నుండి బయటకు వచ్చినప్పటికీ లడఖ్ ప్రజల హక్కుల సాధన కోసం ఆయన తన పోరాట పంథాను వదిలిపెట్టలేదు.

ఈసారి నీట్ పేపర్ లీకేజీయే టార్గెట్

ప్రస్తుతం సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 19 రోజులుగా తీవ్రమైన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. అయితే, ఈసారి ఆయన దీక్షకు కారణం కేవలం లడఖ్ సమస్య మాత్రమే కాదు, జాతీయ స్థాయి విద్యా సంక్షోభం. దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారం లోకి నెట్టిన నీట్ ప్రవేశ పరీక్షల పేపర్ లీకేజీ వివాదంపై ఆయన నిరసన వ్యక్తం చేస్తున్నారు. విద్యావ్యవస్థలో జరిగిన ఈ భారీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భారతదేశ విద్యావ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి సమూలమైన సంస్కరణలు చేపట్టాలని కాక్రోచ్ జనతా పార్టీతో కలిసి ఈ ఉమ్మడి దీక్షకు శ్రీకారం చుట్టారు.

పడిపోతున్న బరువు.. కోర్టు జోక్యం..

ప్రస్తుతం వాంగ్‌చుక్ ఆరోగ్యం అత్యంత ఆందోళనకరంగా, క్లిష్టమైన దశకు చేరుకుంది. దాదాపు మూడు వారాలుగా కేవలం ఉప్పు నీటిపైనే జీవిస్తున్న ఆయన, 9 కిలోలకు పైగా శరీర బరువును కోల్పోయారు. ప్రస్తుతం ఆయన బరువు 57 కిలోలకు పడిపోవడంతో అవయవాల పనితీరు మందగించింది. ఆయన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని గుర్తించిన ఢిల్లీ హైకోర్టు ఈ కేసులో తీవ్రంగా జోక్యం చేసుకుంది. 'ప్రతి ఒక్కరి ప్రాణం ఎంతో విలువైనది' అని స్పష్టం చేస్తూ, వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక ప్రభుత్వ వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేయాలని, అవసరమైతే తక్షణ అత్యవసర వైద్య సేవలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రభుత్వ మౌనం.. పార్లమెంట్ మార్చ్ వైపు అడుగులు

ఆరోగ్యం ఎంత వేగంగా క్షీణిస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు తన పోరాటాన్ని ఆపేది లేదని వాంగ్‌చుక్ పట్టుదలతో ఉన్నారు. ప్రతిపక్ష నేతలు, పౌర సమాజ ప్రతినిధులు ఆయనను కలిసి దీక్ష విరమించాలని కోరుతున్నప్పటికీ, జూలై 20న జరగబోయే పార్లమెంట్ మార్చ్ వరకు తాను దీక్షను కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంత పెద్ద ఎత్తున నిరసన సాగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిరసనకారులతో కనీసం అధికారిక చర్చలు జరపకపోవడంపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశ భవిష్యత్తును మార్చే విద్యావ్యవస్థ ప్రక్షాళన కోసం సాగుతున్న ఈ అహింసా పోరాటం ముమ్మందు ఎలాంటి మలుపు తిరుగుతుందోనని యావత్ దేశం ఉత్కంఠగా గమనిస్తోంది.



ఇంటర్ అర్హతతో నేడు మెగా జాబ్ డ్రైవ్

- **హెచ్‌సీఎల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక**

కాజీపేట, జూలై 17, సిరి న్యూస్:

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీ నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రాం కోసం ఈనెల 18న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఐసీఎస్సెస్ కంప్యూటర్ కేంద్రంలో అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ ఎంపికకు 2025 2026 విద్యా సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ ఏ గ్రూపులో ఇంటర్ పూర్తి చేసినా అర్హులేనని, ఇంటర్ పరీక్షల్లో 75% మార్కులుండాలని తెలిపారు. టెక్‌బీ ప్రోగ్రాంలో ఎంపికైన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతోపాటు డిగ్రీ కూడా పూర్తి చేసుకోవచ్చన్నారు. జీతం సంవత్సరానికి రూ.2.2 నుండి రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆండ్రాయిడ్ మొబైల్ వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా ఇన్‌చార్జి నరేష్ (7569177071/79818 34205)ను సంప్రదించాలన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం

వికారాబాద్, జూలై 17, సిరి న్యూస్

భర్త వేధింపులను తాళలేక ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషాద ఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో తల్లి, కుమార్తె మృతి చెందగా, కుమారుడు బావిలోని చెట్టు కొమ్మను పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

వేధింపులతో తీసుకున్న దారుణ నిర్ణయం

పోలీసుల వివరాల ప్రకారం, యలాల్ మండలానికి చెందిన సుధాకర్ కుటుంబం ఉపాధి కోసం పదేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చింది. తోటలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంలో సుధాకర్ మద్యం సేవించి తరచూ భార్య వసంతతో గొడవపడుతూ వేధించేవాడని సమాచారం. గురువారం రాత్రి కూడా మద్యం మత్తులో ఇంటికి వచ్చి గొడవపడడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత తన ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ముగ్గురూ బావిలోకి దూకారు.

చెట్టు కొమ్మతో నిలిచిన ప్రాణం

బావిలో పడుతున్న సమయంలో బాలుడు వేణు చేతికి లోపలికి వంగి ఉన్న చెట్టు కొమ్మ తగలడంతో దానిని గట్టిగా పట్టుకున్నాడు. సుమారు అరగంట పాటు ప్రాణభయంతో అదే కొమ్మను పట్టుకుని సహాయం కోసం ఎదురుచూశాడు. ఇదే సమయంలో ఇంట్లో భార్య, పిల్లలు కనిపించక వెతుకుతున్న సుధాకర్ బావి వద్దకు చేరుకోగా, లోపలి నుంచి కుమారుడి అరుపులు వినిపించాయి. వెంటనే బావిలోకి దిగి వేణును సురక్షితంగా బయటకు తీసుకొచ్చాడు.

తల్లి, కుమార్తె మృతి

అయితే అప్పటికే వసంత, ఆమె కుమార్తె నవ్య నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దర్యాప్తు కొనసాగింపు

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కుటుంబ పరిస్థితులు, వేధింపుల ఆరోపణలు సహా అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు, స్థానికుల వాంగ్మూలాలను నమోదు చేసి ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగిస్తున్నారు.

ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **'రోహిత్ వేముల చట్టం' ముసాయిదాపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం**
- **ఆనాటి హామీని నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం**

హైదరాబాద్, జూలై 16, సిరి న్యూస్ :

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే గుర్తింపు ఆధారిత వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రోహిత్ వేముల తెలంగాణ(ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు2026 రూపకల్పనపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి కీలక సమావేశం సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యా సంస్థల్లో వివక్ష లేని ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం చట్టాన్ని అత్యంత పటిష్ఠంగా రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయు□)లో జరిగిన రోహిత్ వేముల విషాద ఉదంతం తెలంగాణనే కాక దేశం మొత్తాన్ని కదిలించిందన్నారు. ఆనాడు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటంలో ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా యూనివర్సిటీకి వచ్చి సంఘీభావం ప్రకటించారని గుర్తు చేశారు. నాడు విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ నాటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా తాను (భట్టి విక్రమార్క), మంత్రి శ్రీధర్‌బాబు, క్రియాశీలక నేత పొన్నం ప్రభాకర్ పెద్ద ఎత్తున పోరాడామన్నారు. భవిష్యత్తులో ప్రజా ప్రభుత్వం వచ్చాక విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి వివక్ష లేని విద్యా విధానాన్ని, చట్టాన్ని తీసుకొస్తామని ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం ఈ రోజు నెరవేర్చడానికి రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తున్నదని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలని, వివక్ష కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండకూడదన్న రాహుల్ గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని భట్టి చెప్పారు.

బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలి

బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.ఇందుకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కొత్త చట్టానికి సంబంధించిన సమగ్ర విధివిధానాలతో కూడిన ప్రాథమిక ముసాయిదా నివేదికను సిద్ధం చేయాల్సిందిగా సంబంధిత శాఖ సెక్రటరీని ఆదేశించారు. కర్ణాటకలో ఇప్పటికే ఇలాంటి చట్టం కోసం జరుగుతున్న ముసాయిదా ప్రయత్నాలను పరిశీలించి అక్కడి ఉత్తమ పద్ధతులను స్వీకరించాలని సూచించారు. ఈ చట్టం రూపకల్పనలో ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తామని, రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ప్రకటించారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నామని, ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి బిల్లులో తుది మార్పులు ఉంటాయని స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదం పొందిన అనంతరం ఈ చరిత్రాత్మక బిల్లును త్వరలోనే శాసనసభ ముందుకు తీసుకొస్తామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.

న్యాయపరంగా పటిష్ఠంగా ఉండాలి

ఈ చట్టానికి భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు, సుప్రీంకోర్టు అడ్వకేట్, సామాజిక కార్యకర్త దిశా వాడేకర్‌ను ప్రత్యేక ఆహ్వానితురాలిగా పిలిపించి చర్చించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కొలంబియా లా స్కూల్(న్యూయార్క్) నుండి ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఆమె అనుభవం చట్టాన్ని అత్యంత సమగ్రంగా, లోపరహితంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమావేశానికి కమిటి సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు హాజరయ్యారు.

అన్నం.. ఆరోగ్యం.. ఆరా

- పిల్లల భోజనంతో రాజీ పడితే సహించం
- యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నాగేష్ పటేల్-ఆరా





ఝరాసంఘం, జులై17(సిరిన్యూస్)

ఝరాసంఘం మండలంలో గల ఎల్లోయి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నాగేష్ పటేల్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నాగేష్ పటేల్ మాట్లాడుతూ, "పేద విద్యార్థుల ఆకలి తీర్చే మధ్యాహ్న భోజన పథకం నిర్లక్ష్యానికి కాదు, నాణ్యతకు నిదర్శనంగా ఉండాలి. పిల్లల కడుపు నింపే అన్నంలో నిర్లక్ష్యం, అవినీతి, అలసత్వానికి ఏమాత్రం తావు ఉండదు. నేడు పాఠశాలల్లో అందుతున్న భోజనం రేపటి భారత పౌరుల ఆరోగ్యానికి పునాది. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో తరచూ తనిఖీలు నిర్వహించి, ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి. పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. విద్యార్థుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుంది" అని స్పష్టం చేశారు.అనంతరం పాఠశాలలోని మౌలిక వసతులు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పరిశీలించి, అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండప్ప, కాంగ్రెస్ నాయకులు సంతోష్,రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సమీపంలో మహిళా మృతి దేహం లభ్యం

నర్సాపూర్ జూలై 17 (సిరి న్యూస్)



నర్సాపూర్ పట్టణంలో బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని మహిళ శవం లభ్యమైంది. మహిళను చేతులు కట్టేసి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యాచారం చేసి హత్య చేసినట్లు స్థానికులు భావిస్తున్నారు. మృతి చెందిన మహిళ వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. మృతి చెందిన మహిళ గురువారం రాత్రి సమయంలో సమీప ప్రాంతంలో తిరిగినట్లు చూసిన కొందరు స్థానికులు తెలిపారు. మహిళకు సంబంధించిన వివరాలు తెలియరాలేవు. పోలీస్ దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది

తగ్గేదే లే తుమ్మల పాండురంగారెడ్డి సైన్యం రెడీ!

సంగ్రామ సదస్సును విజయవంతం చేద్దాం

అమీన్‌పూర్ జులై 17 సిరి న్యూస్



అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బిఆర్ఎస్ యువత, హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో, రేపు జరగబోయే సంగ్రామ సదస్సు కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురం గారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో బయలుదేరాలని ఆయన పిలుపు నిచ్చారు. కదం తొక్కిన యువత సంగ్రామ సదస్సుకు మద్దతుగా మాజీ మున్సిపల్ చైర్మన్ పిలుపుతో నియోజకవర్గంలోని , అమీన్పూర్ జిహెచ్ఎంసి నలుమూలల నుండి యువత భారీ సంఖ్యలో తరలి రానున్నారని తెలిపారు. భారీ కాన్వాయ్ మాజీ మున్సిపల్ చైర్మన్ స్వయంగా ముందుండి నడిపిస్తూ వందలాది బైకులు వాహనాలతో యువసైన్యం సదస్సు వేదిక వైపునకు భారీ ర్యాలీగా రేపు బయలుదేరనున్నారని తెలిపారు. లక్ష్యసాధన కోసం ప్రయాణం సదస్సు ఉద్దేశాలను ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు యువత ఇంత పెద్ద ఎత్తున కదిలిందని మాజీ మున్సిపల్ చైర్మన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. విజయవంతం చేయడమే ధ్యేయం ఈ సంగ్రామ సదస్సును చారిత్రాత్మక విజయవంతం చేయడంలో తమ ప్రాంత యువత పాత్ర అత్యంత కీలకమని అందుకే స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘట్‌కేసర్‌లో సీఎం పర్యటనకు సర్వం సిద్ధం..





- రూ.3.95 కోట్లతో 'అందెశ్రీ స్మృతి వనంకు నేడు శంకుస్థాపన..
- రాష్ట్ర కవి జయంతి వేడుకలు ఘనంగా..
- ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 17 (సిరి న్యూస్):

తెలంగాణ భాషా గౌరవానికి చిరునామాగా నిలిచిన రాష్ట్ర కవి అందెశ్రీ జయంతి వేడుకలు శనివారం ఘట్‌కేసర్‌లో వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై రూ.3.95 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అందెశ్రీ స్మృతి వనంకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగంలో మరో కీలక ఘట్టంగా నిలవనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెది సుదీర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి తదితరులు స్మృతి వనం ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, భద్రత, పార్కింగ్, తాగునీరు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందెశ్రీ జయంతిని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరుకానున్నట్లు వెల్లడించారు.రూ.3.95 కోట్లతో నిర్మించనున్న అందెశ్రీ స్మృతి వనం తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి, ఉద్యమ చరిత్రను భావితరాలకు పరిచయం చేసే సాంస్కృతిక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు..

ప్రతి ఓటరికి చేరేలా..ఇంటింటా ఆటో ప్రచారం..

- ఓటరు సవరణపై ఆటో ప్రచారం..
- ప్రజలకు అవగాహన కల్పింపు..
- ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం..
- ముద్దం నరసింహ యాదవ్ పిలుపు..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 17 (సిరి న్యూస్):

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా చూడాలనే లక్ష్యంతో ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆటో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికి ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తూ, ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అవసరమైన పత్రాల సమర్పణపై ప్రజలకు సూచనలు అందిస్తున్నారు. ప్రతి అర్హ ఓటరు తన పేరు ఓటరు జాబితాలో ఉండేలా సకాలంలో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఈ ప్రచారం ద్వారా విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి హరినాథ్, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు..



నిరుద్యోగ భృతి హామీతో యువతను మోసం చేసింది బీఆర్ఎస్



- కొల్కురి నరసింహారెడ్డి
- రూ.3,016 నిరుద్యోగ భృతి హామీని అమలు చేయలేదని విమర్శ

పటాన్‌చెరు, జూలై 17 (సిరి న్యూస్):

2018 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, అది సాధ్యం కాకపోతే నెలకు రూ.3,016 నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ హామీని అమలు చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కురి నరసింహారెడ్డి ఆరోపించారు.శుక్రవారం పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీష్‌రావు తదితర బీఆర్ఎస్ నాయకులు 2018 ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, లేకపోతే నెలకు రూ.3,016 నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలను నమ్మి లక్షలాది మంది నిరుద్యోగ యువత బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా వారిని తీవ్ర నిరాశకు గురిచేశారని విమర్శించారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతీన్, పట్టణ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, సాయిలు ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించిన బూరుగడ్డ పుష్పనగేష్

- మిగిలిన పనులకు అదనపు నిధులు మంజూరు చేయిస్తానని హామీ

రామచంద్రపురం, జూలై 17 (సిరి న్యూస్):



రామచంద్రపురం డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ కాలనీలో కొనసాగుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాంగ్రెస్ మహిళా నాయకురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బూరుగడ్డ పుష్పనగేష్ మాట్లాడుతూ, తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఈ స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను మంజూరు చేయించినప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు సకాలంలో ప్రారంభం కాలేదన్నారు. అధికారులపై నిరంతరం ఒత్తిడి తీసుకురావడంతో ప్రస్తుతం పనులు ప్రారంభమైనట్లు తెలిపారు.పరిశీలనలో ప్రస్తుతం చేపడుతున్న పనులతో డ్రైనేజీ సమస్య పూర్తిగా పరిష్కారం కాదని గుర్తించిన పుష్పనగేష్, వెంటనే కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన అదనపు నిధుల కోసం జోనల్ కమిషనర్‌ను స్వయంగా కలిసి ప్రతిపాదనలను ఆమోదింపజేసి, మిగిలిన స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

దేవుడినీ వదల్లేని దుండగులు..

- దేవుడినీ వదల్లేని దొంగలు... నల్ల పోచమ్మ ఆలయంలో హుండీ చోరీ..
- భక్తి భయం మరిచిన మృగాలు...ఆలయ కమిటీ ఆవేదన..
- రెండు హుండీలు పగులగొట్టి నగదుతో పరార్..
- దొంగలను వెంటనే అరెస్ట్ చేయాలని భక్తుల డిమాండ్..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి జులై 17 (సిరి న్యూస్):



మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, కూకట్ పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లి 262 డివిజన్ పరిధిలోని మల్లికార్జున కాలనీ, జలరామ్ టవర్స్ సమీపంలోని శ్రీ దేవి నల్ల పోచమ్మ ఆలయంలో గురువారం అర్ధరాత్రి జరిగిన చోరీ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి వేళ ఆలయ ప్రాంగణంలోకి చొరబడి, హుండీకి అమర్చిన ఇనుప గొళ్లాన్ని పదునైన ఆయుధంతో కోసి, హుండీ తలుపు తెరిచి అందులోని భక్తులు సమర్పించిన నగదు కానుకలను అపహరించి పరారయ్యారు.. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారులు హుండీ తెరిచి ఉండటాన్ని గమనించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కమిటీ సభ్యులు హుండీ గొళ్లెం కోసి ఉండటాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలిసిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, భక్తులు దేవుడిపై విశ్వాసంతో సమర్పించిన కానుకలను దోచుకెళ్లడం కేవలం చోరీ కాదు..కోట్లాది మంది భక్తుల విశ్వాసాలపై దాడి చేసినట్టే. దేవుడిపై భక్తి, భయం, పాపభీతి లేకుండా పోయింది. దేవుడి సొమ్ముకే చేయి వేసే వారు మనుషుల రూపంలో తిరుగుతున్న మృగాలు. ఇలాంటి దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి అని డిమాండ్ చేశారు. భక్తులు మాట్లాడుతూ, దేవాలయాలకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల ఆస్తులకు ఎలా భద్రత ఉంటుంది? దేవుడి ముందు తలవంచాల్సిన వారు, దేవుడి సొమ్మునే దోచుకెళ్లడం సమాజానికి అత్యంత ప్రమాదకర సంకేతం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న బోయిన్ పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హుండీ గొళ్లెం కోసిన తీరును పరిశీలించి ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రాంతంలో భక్తుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆలయాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు, ఈ దోపిడీకి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పోలీసు అధికారులను డిమాండ్ చేస్తున్నారు..






ఖైదీల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలి

- ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు కట్టుదిట్టం చేయాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- కంది సెంట్రల్ జైలులో తనిఖీలు
- జైలు సూపరింటెండెంట్‌తో కలిసి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

సంగారెడ్డి, జూలై 17 (సిరి న్యూస్):

సంగారెడ్డి జిల్లా కందిలోని సెంట్రల్ జైలులో భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. జైలు సూపరింటెండెంట్ సంజయ్ రాయ్‌తో కలిసి ఆయన జైలు ఆవరణ, ప్రధాన ప్రవేశ ద్వారాలు, భద్రతా విధులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఖైదీల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు జైలు లోపలికి రాకుండా ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలను కట్టుదిట్టం చేయాలని సూచించారు. జైలులోని సీసీ కెమెరాలు 24 గంటల పాటు పనిచేసేలా పర్యవేక్షించాలని, గోడలు మరియు సెంట్రీ పాయింట్ల వద్ద భద్రతను బలోపేతం చేయాలని ఆదేశించారు. జైలులో భద్రత కోసం తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, జైలుకు వచ్చే సందర్శకుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బందికి క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, జైలు భద్రత విషయంలో జైలు శాఖ, పోలీస్ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐపీఎస్, ఇతర జైలు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మెదక్ వారసత్వ సంపదను కాపాడుదాం

- పర్యాటక ప్రచారానికి విచ్చేయనున్న సినీ నటుడు మంచు విష్ణు.

మెదక్ జూలై.17(సిరి న్యూస్)





ప్రాచీన వారసత్వ సంపదను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది బావి తరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.మెదక్ జిల్లా వారసత్వ పర్యాటకాన్ని జాతీయ స్థాయిలో ప్రచారం చేసే లక్ష్యంతో జిల్లా పర్యాటక శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.ఇందులో భాగంగా ప్రముఖ టాలీవుడ్ నటుడు మంచు విష్ణు శనివారం మెదక్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించనున్నారు. ఈ కార్యక్రమం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతోందన్నారు.అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం ఉదయం 6:30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 8:30 గంటలకు ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయాన్ని, అనంతరం 9:45 గంటలకు మెదక్ కోటను, 11:15 గంటలకు మెదక్ కేథడ్రల్ చర్చిని సందర్శించ నున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం ప్రారంభించి, 2:15 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్నారు.ఈ పర్యటనలో ఆలయాలు, చారిత్రక కట్టడాల వద్ద ప్రచార వీడియోలు, ఫోటో షూట్లు, మీడియా బైట్లు నిర్వహించి మెదక్ జిల్లా పర్యాటక విశిష్టతను దేశవ్యాప్తంగా పరిచయం చేయనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.జిల్లా పర్యాటక శాఖ, పోలీసు శాఖ, ఐ&పీఆర్ శాఖ సంయుక్తంగా భద్రత, ప్రోటోకాల్, మీడియా సమన్వయ ఏర్పాట్లు చేస్తున్నాయి. మెదక్‌ను ప్రముఖ హెరిటేజ్ టూరిజం గమ్యస్థానంగా తీర్చిదిద్దే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాల్లో ఈ పర్యటన కీలకంగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు.

జోగిపేట ఉన్ని సంఘం లో మహిళ డైరెక్టర్లు ఏకగ్రీవం

- 7 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు
- ఎన్నికల అధికారి నిర్మల రాజ్ కుమారి

జోగిపేట, జూలై 17, (సిరి న్యూస్):

జోగిపేట ఉన్ని సహకార సంఘం ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నామినేషన్ల విత్ డ్రా కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 9 డైరెక్టర్ స్థానాలకు గాను 2 మహిళా డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మహిళా కోటాలో 2 డైరెక్టర్ స్థానాలకు ముగ్గురు మహిళలు నామినేషన్లు వేశారు. ఇందులో గూడెం భాగ్య తమ నామినేషన్ ఉపసంహరణ చేసుకోవడంతో మిగిలిన ఇద్దరూ పెంటమ్మ, బుజ్జమ్మ లు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి నిర్మల రాజకుమారి ప్రకటించారు. మిగిలిన ఏడు స్థానాలకు 11 మంది పోటీలో ఉండగా అందులో బురగోని శ్యామ్ ప్రసాద్ తమ నామినేషన్ విత్ డ్రా చేసుకోవడంతో పదిమంది బరిలో ఉన్నారు. ఈనెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షనే ధ్యేయం!

అమీన్పూర్ ఎస్హెచ్ఓ గా ప్రవీణ్ రెడ్డి బాధ్యతల స్వీకరణ!

అమీన్పూర్ జులై 17 సిరి న్యూస్



అమీన్పూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్హెచ్ఓ గా ప్రవీణ్ రెడ్డి శుక్రవారం అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. ఘన స్వాగతం అమీన్పూర్ పోలీస్ స్టేషన్కు చేరుకున్న నూతన ఎస్హెచ్ఓ ప్రవీణ్ రెడ్డికి స్థానిక ఎస్సైలు పోలీస్ సిబ్బంది మరియు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్పూర్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణే లక్ష్యం పెరుగుతున్న అమీన్పూర్ పరిధిలో దొంగతనాలు చట్టవిరుద్ధ కార్యకలాపాలు మరియు ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారం అవసరం శాంతి భద్రతల పరిరక్షణలో స్థానిక ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు కొత్త సీఐ..

బాలానగర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా జి. ప్రశాంత్ బాధ్యతల స్వీకరణ..



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 17 (సిరి న్యూస్):

బాలానగర్ పోలీస్ స్టేషన్ లో నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్గా జి. ప్రశాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని బాధ్యతలు చేపట్టిన వెంటనే స్పష్టం చేశారు. ఇంతకుముందు బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహించిన టి. నర్సింహా రాజు గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారి పదవికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో జి. ప్రశాంత్‌ను నియమించారు. ఈ సందర్భంగా జి. ప్రశాంత్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు..ఈ సందర్భంగా ఎస్ఐలు హాజీ, వినోద్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు శేఖర్, ఆనంద్ కుమార్ తోపాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన సీఐ జి. ప్రశాంత్ లకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు..

వారాహి దేవీ గుప్త నవరాత్రులు

- వనస్థలిపురం గణేష్ టెంపుల్, జయ దుర్గాదేవి ఆలయంలో దేవి అమ్మవారికి అభిషేకాలు, హోమాలు
- పూజా కార్యక్రమాలు






వనస్థలిపురం, సిరి న్యూస్, జూలై 17:

వనస్థలిపురం గణేష్ టెంపుల్, జయదుర్గా దేవి ఆలయంలో వారాహి దేవీ గుప్త నవరాత్రులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 (బుధవారం) నుంచి 23 (గురువారం) తేదీ వరకు వారాహీ దేవి అమ్మ వారి గుప్త నవరాత్రులు, హోమాలు, పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తునారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభం అవుతున్నాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, అభిషేకం, హోమం, అమ్మవారి మూల మంత్రం హోమం , పూజా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజు భక్తుల గోత్ర నామ అర్చన చేరుతున్నారు. శుక్రవారం లక్ష్మీ కుబేర హోమం నిర్వహించారు. భక్తులకు పూలతో పాటు నానేలు ప్రసాదంగా పంపిణీ చేయడం గమనార్హం. వారాహి దేవీ అమ్మవారి గుప్త నవ రాత్రులు పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

ఘట్కేసర్ ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదం !





- ఆగిఉన్న ఆటోను ఢీకొన్న లారీ
- ఇరువురు మృతి ఒకరికి తీవ్ర గాయాలు

కీసర జులై 17, సిరిన్యూస్;

జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో మేకలు, గొర్రెల వ్యాపారానికి వెళ్లిన ఇరువురిని మృత్యువు కబళించింది. విశ్రాంతి తీసుకుందామని రోడ్డు పక్కన ఆపిన ఆటోను లారీ ఢీకొనడంతో ఇరువురు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఘట్కేసర్ ఓఆర్ఆర్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగింది.పోలీసుల కతనం ప్రకారం మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన గొర్రెల వ్యాపారులు కాటికే రషీద్ (38)రషీద్, గౌస్(50) డ్రైవర్ రాములు తో కలిసి గురువారం హైదరాబాద్ వెళ్లారు.తమ పని ముగించుకొని వాహనంలో తిరిగివస్తు ఘట్‌కేసర్ వద్ద రోడ్డు పక్కన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వేగంగా వచ్చిన ఓ లారీ వెనుక వైపు నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రషీద్, డ్రైవర్ రాములు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం కు పంపించారు. సంఘటన సమాచారం అందిన వెంటనే పాపన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అధికారులతో మాట్లాడి పోస్ట్ మార్టం చేయించి మృతదేహాలను పాపన్నపేటకు తరలించారు.

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా వైద్యాధికారి

వెల్దుర్తి,జులై 17,(సిరి న్యూస్):

వెల్దుర్తి లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయము ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు.వర్షాకాలంలో ఆడపిల్లలు ఆరోగ్యంగా వుండాలని , వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , ఈ సీజన్ లో ముఖ్యంగా జలుబు, జ్వరం, దగ్గు, ఫ్లూ, న్యుమో నియా, మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, వాంతులు విరేచనాలు మొదలైన వ్యాధులు వచ్చే అవకాశం వుందని, కాబట్టి కలుషిత ఆహారం, నీరు తాగవద్దని, వేడి వేడి ఆహారాన్ని తినాలని, శుభ్రమైన మంచి నీటినే తాగాలని, ఆహార పదార్థాలపై మూతలు తప్పక పెట్టాలని, ఈగలు, దోమలు లేకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని, చేతుల పరిశుభ్రత తప్పక పాటించాలని, జలుబు, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి పరీక్షలు చేయించుకొని చికిత్స తేసుకోవాలని, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు మోచేతిని అడ్డం పెట్టుకోవాలని, 14 – 15 సంవత్సరాల మధ్య వున్న అమ్మాయిలు హెచ్.పి.వి. వ్యాక్సిన్ తప్పక తీసుకోవాలని వారు విద్యార్థులకు తెలిపారు. , జిల్లాలో ఇప్పటివరకు 70 % హెచ్.పి.వి. ఇమ్యూనైజేషన్ పూర్తిచేశామని, మిగిలిన వారికి కూడా టీచర్లు, తల్లిదండ్రుల, భాగస్వా మ్యంతో పూర్తి చేస్తామని, దీనివల్ల భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్, ఇతర క్యాన్సర్ ఇన్ఫెక్షన్లు రాకుండా ముంద స్తుగానే నివారించవచ్చని, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నాడు అల్బెండజోల్ టాబ్లెట్ వేసుకోని వారు 20 వ తేది నాడు నిర్వహించే మాపప్ కార్యక్రమం రోజున తప్పక తీసుకోవాలని పిల్లలకు సూచించారు. చదువు కుంటున్న పిల్లలు చదువులు పూర్తి అయ్యేంతవరకు , తమ కాళ్ల మీద సొంతంగా నిలబడే వరకు , కనీసం 21 సంవత్సరాల వయసు దాటిన తర్వాతే పెళ్లి గురించి ఆలోచించాలని, మానసికంగా , శారీరకంగా పూర్తిగా ఎదగని యుక్త వయసులో తొందరపడి పెళ్లి చేసుకోవడం వల్ల శారీరక , మానసిక సమస్యలు చాలా వస్తాయని, రక్తహీనతతో బాధపడుతారని, అలాంటి చిన్న వయసులో గర్భం ధరించడం వల్ల



గర్భస్రావాలు జరుగుతాయని, పుట్టబోయే శిశువు కూడా సరైన బరువు లేక అనారోగ్యంతో పుడుతారని, కావున పెళ్లి విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకొని శారీరక మానసిక సమస్యలు కొని తెచ్చుకోవద్దని తెలిపారు. హాస్టల్ రూంలను, వంటలు చేసే సామాగ్రిని, కిచెన్ ను, తాగునీటిని , వాష్ రూంలను, నీరు బయటికి పోయే నాళాలను , పాఠశాల ఆవరణను పరిశీలించి పరిశుభ్రత, ఫుడ్ పాయిజనింగ్ కాకుండా, దోమలు పుట్టకుండా , కుట్టకుండా , వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్, ఎస్ ఓ ఫాతిమా, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయనిలు, పాల్గొన్నారు.


నూతన కార్యాలయాలకు స్థల పరిశీలన చేయాలి.

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జూలై.17(సిరి న్యూస్)

జిల్లాలోని నూతన మండలాలలో తహసిల్దార్ కార్యాలయానికి, సబ్ రిజిస్టర్ కార్యాలయాల నూతన భవన నిర్మాణానికి స్థలం సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి గూగుల్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.నూతన మండలాలైన హవేలీ ఘనపూర్ ,నిజాంపేట, చిలిపిచేడ్,మండలాలకు తహసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి భూసేకరణ త్వరిత గతిన చేపట్టాలన్నారు.మెదక్ ,నర్సాపూర్, రామాయంపేట డివిజన్ పరిధిలో రిజిస్టర్ కార్యాలయ





భవన నిర్మాణం కోసం స్థల సేకరణను వేగవంతం చేసి సంబంధిత ఫైళ్లను ఉన్నతాధికారులకు నివేదించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ బవయ్య,తహసిల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం ఇన్స్పెక్టర్‌గా జి. లాలు నాయక్, కొల్లూర్ ఇన్స్పెక్టర్‌గా సి. హెచ్. సైదిరెడ్డి





రామచంద్రపురం, జూలై 17 (సిరి న్యూస్):

తెలంగాణ పోలీసు శాఖలో భాగంగా పలువురు పోలీసు ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ డాక్టర్ జగన్నాథ్‌ను బదిలీ చేయగా, ఆయన స్థానంలో జి. లాలు నాయక్‌ను ఇన్స్పెక్టర్‌గా నియమించారు.అదే విధంగా, కొల్లూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా సి. హెచ్. సైదిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు కొల్లూర్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన గణేష్ పటేల్ బదిలీపై వెళ్లడంతో, ఆయన స్థానంలో సైదిరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మెరిసిన ఓరగంటి నేహా శ్రీ

- గిన్నిస్ రికార్డుతో మెరిసిన రామాయంపేట అమ్మాయి
- 1,500 మంది పాల్గొన్న ప్రదర్శనలో అరుదైన విజయం

రామాయంపేట, జూలై 17 (సిరి న్యూస్)

పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే ప్రపంచ స్థాయిలోనూ విజయాలు సాధించవచ్చని రామాయంపేటకు చెందిన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణి ఓరగంటి నేహా శ్రీ నిరూపించింది. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన భారీ మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన ఆమె, మెదక్ జిల్లా నుంచి ఈ ఘనత అందుకున్న ఏకైక క్రీడాకారిణిగా నిలిచింది. చిన్నప్పటి నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకుని కఠోర సాధనతో ముందుకు సాగిన రామాయంపేట పట్టణానికి చెందిన ఓరగంటి నేహా శ్రీ గత పదేళ్లుగా మార్షల్ ఆర్ట్స్‌లో నిరంతర సాధన చేస్తూ అనేక పోటీల్లో ప్రతిభ చాటిన ఆమె, తాజాగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి రామాయంపేటతో పాటు మెదక్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ ఏడాది ఏప్రిల్ 26న నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నిర్ణీత సమయంలో సమన్వయంతో ప్రత్యేక మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నమోదు చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో మెదక్ జిల్లా నుంచి పాల్గొన్న ఏకైక యువ క్రీడాకారిణిగా ఓరగంటి నేహా శ్రీ నిలిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందుకుంది.

తండ్రి అడుగుజాడల్లో... విజయాల బాటలో

నేహా శ్రీ చిన్న వయస్సు నుంచే తన తండ్రి ప్రోత్సాహంతో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ప్రారంభించింది. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతోంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ లక్ష్యసాధనే



ధ్యేయంగా కష్టపడి ఈ అరుదైన విజయాన్ని సొంతం చేసుకుంది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన నేహా శ్రీని ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గురువులు, పట్టణ ప్రజలు, క్రీడా సంఘాల ప్రతినిధులు, పలువురు నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఆమె మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి రామాయంపేట, మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలను పంపిణీ చేసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి

కనిగిరి ప్రతినిధి, జూలై 17, (సిరి న్యూస్):

కనిగిరిలో అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు బ్యాటరీ వాహనాలను అందజేసిన అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వారి స్వయం ఉపాధి, రవాణా సౌకర్యం మెరుగుపడేలా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నారాయణస్వామి, డిప్యూటీ పీడీ సువార్తమ్మ, కుప్పం రంగసాయి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. బ్యాటరీ వాహనాలు అందుకున్న లబ్ధిదారులు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



బిజెపి కృషితోనే వై జంక్షన్ వద్ద బ్రిడ్జి మంజూరు

- బీఆర్ఎస్ ప్రజలను తప్పదోవ పట్టిస్తోందని విమర్శ
- రూ.48 కోట్ల బ్రిడ్జి మంజూరు చేసిన ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు
- బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్
- మోదీ, గడ్కరీ, రఘునందన్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం..

రామాయంపేట, జూలై 17 (సిరి న్యూస్)



బిజెపి కృషితోనే రామాయపేట వై జంక్షన్ వద్ద, బ్రిడ్జి నిర్మానానికి నిధులు మంజూరు అయ్యాయని బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాలుదాస్ రాధా మల్లేష్ గౌడ్ అన్నారు. రామాయంపేట పట్టణ చౌరస్తాలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వై జంక్షన్ బ్రిడ్జి మంజూరు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్, రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, రామాయంపేట వై జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి, డీపీఆర్ సిద్ధం చేయించి రూ.48 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఇది ఎంపీ ఏడాది కాలంగా చేసిన కృషికి దక్కిన ఫలితమని పేర్కొన్నారు.గత పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పద్మా దేవేందర్ రెడ్డి, ఎంపీగా కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పటికీ, వై జంక్షన్ వద్ద వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను పట్టించుకోలేదని ఆరోపించారు. అనేక మంది ప్రాణాలు కోల్పోయినా బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పుడు బీజేపీ ప్రజాప్రతినిధుల కృషితో ప్రాజెక్టు మంజూరైన తర్వాత దానిని తమ ఘనతగా చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు.వై జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన 30 మందికి పైగా కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకులు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రామాయంపేట ప్రజల చిరకాల డిమాండ్ అయిన ఈ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు పట్టణ ప్రజల తరఫున, బీజేపీ జిల్లా శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సర్పంచ్ శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కౌన్సిల్ శంకర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ పంజా విజయ్, జిల్లా నాయకులు సిద్ధిరాములు, పబ్బ సత్యం, రాజు శేఖర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సర్పంచ్ బాలరాజు, మండల అధ్యక్షుడు సర్పంచ్ నవీన్, సర్పంచులు యాదగిరి, నరేందర్, ప్రవీణ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆసియా అండర్-23 అథ్లెటిక్స్‌లో స్వర్ణ పతకం

- **తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన గురుకుల విద్యార్థిని నారిమల్ల ప్రవళిక..**
- **ప్రవళికను అభినందించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్..**



హైదరాబాద్ బ్యూరో, జూలై 17, (సిరి న్యూస్) :

చైనాలోని ఓర్డోస్‌లో నిర్వహించిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4×400 మీటర్ల రిలే పోటీలో భారత జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చాంబర్ లో నారిమల్ల ప్రవళికను మంత్రి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ

తెలంగాణకు చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడా అకాడమీ విద్యార్థిని నారిమల్ల ప్రవళిక సభ్యురాలిగా నిలిచి దేశ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. నల్గొండ జిల్లా డిండి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన ప్రవళిక, సాధారణ కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయి అథ్లెట్‌గా ఎదిగి దేశానికి స్వర్ణ పతకాన్ని అందించడమే కాకుండా తెలంగాణ యువతలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిందని మంత్రి కొనియాడారు. ఆమె విజయం గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందనడానికి నిదర్శనమని అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఆధునిక క్రీడా వసతులు, నిపుణుల శిక్షణ, పోషకాహారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన శిక్షణా అవకాశాలను ప్రభుత్వం నిరంతరం విస్తరిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా గుర్తించి, ప్రతిభకు సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఒలింపిక్ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించే తెలంగాణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్-1 స్థాయి ఉద్యోగం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం యువ క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని మంత్రి తెలిపారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తెలంగాణలో క్రీడా సంస్కృతికి మరింత బలాన్ని చేకూర్చి, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో యువతను ముందుకు నడిపిస్తుందని అన్నారు. ప్రవళికను ఈ స్థాయికి తీర్చిదిద్దడంలో విశేష కృషి చేసిన ఆమె కోచ్ శ్రీ పస్పుల పరుశురాముడు, డిండి సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడా అకాడమీ శిక్షక బృందం, తల్లిదండ్రులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఒక క్రీడాకారుడి విజయానికి కుటుంబ సభ్యులు, కోచ్‌లు, శిక్షకుల అంకితభావం ఎంతో కీలకమని అన్నారు. ప్రవళిక సాధించిన ఈ స్వర్ణ విజయం తెలంగాణ గురుకుల విద్యార్థులకు మాత్రమే కాకుండా రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆసియా క్రీడలు, ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు, కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్స్ వంటి అత్యున్నత వేదికలపై మరిన్ని పతకాలు సాధించి భారతదేశానికి, తెలంగాణకు చిరస్థాయి కీర్తి తీసుకురావాలని నారిమల్ల ప్రవళికకు మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నాతాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు పోలీసు కళాబృందం అవగాహన



చొప్పదండి/కొడిమ్యాల, జూలై 17, (సిరి న్యూస్) :

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో శుక్రవారం పోలీసు కళాబృందం మాదక ద్రవ్యాలు నిషేధం, సైబర్ నేరాలు, మహిళా సాధికారత ట్రాఫిక్ హెల్మెట్ దారణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు కళాబృందం వారిచే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కళాబృందం ఇన్చార్జ్ కమల్ ఇస్లావత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం రమేష్, సత్తయ్య, సతీష్, కాంతయ్య, లక్ష్మణ్ హనుమత్, షీ టీం ఇన్చార్జి పూజిత, భరోసా టీం సుజాత, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బి.లావణ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమాన

- **హత్య కేసులో నిందితురాలును దోషిగా తేల్చిన జగిత్యాల జిల్లా కోర్టు..**



జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూలై 17, (సిరి న్యూస్) :

కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన భర్త హత్య కేసులో నిందితురాలికి జగిత్యాల ప్రధాన జిల్లా, సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 2022 నవంబర్ 11న రాత్రి కొడిమ్యాల గ్రామంలో బత్తుల శ్రీను తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అతని భార్య బత్తుల ప్రమీలకు ఉన్న అక్రమ సంబంధం నేపథ్యంలో వివాదం జరిగింది. అనంతరం శ్రీనును హత్య చేసి సంఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని చీరతో ఉరివేసుకున్నట్లు కనిపించేలా ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొడిమ్యాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయగా ఈ కేసును మొదట బి. కోటేశ్వర్, అప్పటి సీఐ దర్యాప్తు చేయగా అనంతరం డి. రమణమూర్తి, సీఐ దర్యాప్తును పూర్తి చేసి కోర్టుకి ఆధారాలు సమర్పించగా పిపి రామకృష్ణారావు కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన జగిత్యాల ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీమతి రత్న పద్మావతి శుక్రవారం 17న తీర్పు వెలువరిస్తూ నిందితురాలు బత్తుల ప్రమీల వయస్సు 25 సంవత్సరాలను దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10000 జరిమానా విధించింది. పై కేస్ లో నిందితురాలుకి శిక్ష పడటం పడటంలో కృషి చేసిన పీపీ రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్లు కోటేశ్వర్, రమణమూర్తి, సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ హరీష్, సిఎంఎస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

దమ్మపేట గ్రంథాలయంకు శంకుస్థాపన చేసిన రాజ్యసభ ఎంపీ రేణుక చౌదరీ, ఖమ్మం పార్లమెంట్ ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారె

- **చాలా సంవత్సరాల తర్వాత ఇక్కడకు రావడం చాలా సంతోషంగా ఉంది, పుట్టింటికి వచ్చిన ఆనందం కలుగుతుంది - రేణుక చౌదరీ**



దమ్మపేట, జూలై 17,(సిరి న్యూస్):

దమ్మపేట మండల కేంద్రంలో గ్రంథాలయం పునర్నిర్మాణానికి శుక్రవారం రాజ్యసభ ఎంపీ రేణుక చౌదరి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాది కొత్తగూడెం జిల్లా గ్రంథాలయం చైర్మన్ పసుపులేటి వీరబాబు లతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రేణుక చౌదరి మాట్లాడుతూ నెలకు ఒక పుస్తకం గ్రంథాలయంకి ఇవ్వగలిగితే ఒక మంచి పని చేసిన వాళ్ళు అవుతాం కావున ఆలోచన చేయాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే జారే కోరిన దమ్మపేటకు ఒక కమ్యూనిటీ హాల్ తన నిధుల నుండి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు అందులో మహిళలకు స్వయం సమృద్ధిగా ఉపాధి దిశగా కుట్టు మిషన్ నేర్పించే వంటి కార్యక్రమాలు చేయాలని కోరారు. ఒక్కప్పుడు గ్రామాల్లో పిల్లలు పనులకు పంపే స్థాయి నుండి మారు మూల గ్రామాలలో కూడా పాఠశాలలకు పంపుతున్నాము అంటే అది మన నాయకురాలు సోనియాగాంధీ ఆలోచన అని తెలియజేశారు. పశ్చిమ బెంగాల్లో రాత్రికి రాత్రి బిజెపి ప్రభుత్వం 60 వేల ఓట్లను తొలగించిందని, అలాగే ప్రస్తుతం భారతదేశంలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ గణన ఫారంల పక్రియ లో ఏ ఒక్క ఓటు తీయకుండా ప్రజలు వారికున్న వివరాలను తప్పనిసరిగా ఫారంలో నమోదు చేసుకొని ఓట్లను కోల్పోకుండా జాగ్రత్త పడాలని తెలియజేశారు. జారే ఆదినారాయణ లాంటి ఎమ్మెల్యే దొరకడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి తెలియజేశారు. దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు 40 సంవత్సరాలు క్రితం దమ్మపేట ప్రజలకు ఏర్పాటుచేసిన మంచినీటి సిమెంటు పైప్ లైన్ ప్రస్తుతం వేసిన సిమెంట్ రోడ్లతో అవి రోడ్డుకు మధ్యగా ఉండి లీకేజ్, డ్యామేజ్ అవడంతో రోడ్డును తవ్వి ప్యాచీలు వేయడం చాలా ఇబ్బంది అవుతున్న పరిస్థితిలో దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మంచినీటి పైపులైన్ కోసం తన నిధులతో పాటు తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు ధనసరి సీతక్కను నిధులు కొరతానని ఎంపీ రఘురాం రెడ్డి హామీ ఇచ్చారు. గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ దమ్మపేట మండల కేంద్రంలో ఒక అత్యాధునిక లైబ్రరీ ఉంటే నిరుద్యోగ యువత వారి ఉద్యోగ అవకాశాల కోసం నోటిఫికేషన్లు పడి కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాయడానికి దూరపు ప్రాంతాలకు కోచింగ్ సెంటర్లకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే చదువుకొని మంచి గవర్నమెంట్ ఉద్యోగాలు తెచ్చుకునే అవకాశాలు పెరుగుతాయన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గ్రంథాలయం నిర్మించబోయే ల్యాండ్ కోసం కలెక్టరేట్ సచివాలయంలో ఆర్ అండ్ బి శాఖ నుండి క్లియరెన్స్ తీసుకోవడానికి స్వయంగా పలుమార్లు పర్యవేక్షించి 35 లక్షల ఫండ్స్ శాంక్షన్ చేయించారన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ను భద్రాది కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా, ఎమ్మెల్యే జారే ఆదినారాయణను ప్రభుత్వ విప్ గా ఇద్దరు ఎంపీలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేయవలసిందిగా కోరారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ మన పిల్లలు బాగా చదవడానికి వాళ్లకు కంప్యూటర్స్, ఆన్లైన్లో కోచింగ్ సెంటర్ గ్రంథాలయంకు అనుసంధానం చేసే విధంగా టైప్ చేసి వాళ్లకు ఇంకా టెస్ట్ సిరీస్లు కూడా ఇస్తాము అని, చాలా రకాల సదుపాయాలను అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో గల గిరిజన భవన్ లో కూడా అవకాశాలను కల్పిస్తున్న తరుణంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు తెలియజేశారు. తదనంతరం దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ నివాసంకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, నాయకులు చిన్నశెట్టి యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, చిన్నశెట్టి చిట్టిబాబు, దిశా కమిటీ సభ్యురాలు సొంగా ఏసుమణి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పొదిలి జ్యోతి, రేవతి, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, సి.ఐ నాగరాజు, ఎస్.ఐ రాజేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాక రమేష్, పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, చాట్ల శ్రీనివాసరావు, దాసరోజు సరిత రామారావు, పూనెం పోలమ్మ షేక్ గోరె, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, గోపి, మధు, దాసరోజు రామబ్రహ్మం, వనమాల శ్రీనివాసరావు వసంత, కొయ్యల ప్రసాద్, ఉల్వల రాంబాబు, అన్నవరపు నాగేంద్రరావు, గట్ల నాగరాజు, సర్వేశ్వరరావు, పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సర్ ప్రక్రియ పారదర్శకంగా,సజావుగా జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలి

- **ఇల్లందు నియోజకవర్గ సర్ కో:ఆర్డినేటర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**

ఉమ్మడి ఖమ్మం బ్యూరో, జూలై 17, (సిరి న్యూస్) :

ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం లోని సాతానిగూడెం, ముచ్చర్ల గ్రామాలలో ఇల్లందు నియోజకవర్గ సర్ కో ఆర్డినేటర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి, సర్ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. సర్ ప్రక్రియకు సంబంధించిన జరుగుతున్న పనితీరును పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటు ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఓటరు జాబితాలో పేరు రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు..

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి పనిచేసే ఏకైక యూనియన్

టీయూడబ్ల్యూజే (హెచ్-143)



మహబూబ్‌నగర్, జూలై 17, (సిరి న్యూస్) :

జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే (హెచ్-143) అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ పేర్కొన్నారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డుల సమస్యలపై త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) బలోపేతంగా ఉందన్నారు. అధికార పార్టీకి అనుబంధంగా ఉన్న యూనియన్ గత రెండున్నరేళ్లుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు సక్రమంగా అమలు కాకపోవడం, అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో గందరగోళ పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, నెల రోజుల్లో పూర్తి చేసిన అనంతరం మహాసభలు నిర్వహించి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వెల్లడించారు. అన్ని మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేసి యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. డెస్క్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కూడా యూనియన్ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించగా, వివిధ యూనియన్లకు చెందిన పలువురు జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే (హెచ్-143) సభ్యత్వం స్వీకరించారు. అలాగే జిల్లా అడహాక్ కమిటీని ప్రకటించారు. వి. శివకుమార్‌ను జిల్లా కన్వీనర్‌గా, చింతకాయల వెంకటేష్‌ను కో-కన్వీనర్‌గా రాష్ట్ర కమిటీ నియమించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి యోగానంద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు భాస్కర్, తిరుపతి నాయక్, అలాగే పి. రవికుమార్, నరేంద్ర చారి, నరేందర్ గౌడ్, మధుసూదన్ రావు, తేజ వెంకట్, సతీష్ కుమార్, జి. రవికుమార్, గోపి, కిరణ్, సాయికుమార్, శ్రీనివాస్, కృష్ణ, అంజి, శేఖర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుదీప్ రెడ్డి, లక్ష్మణ్, జక్క గోపాల్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



ఇవి డైలీ తింటే ఆరోగ్యానికి తిరుగుండదు!

హెల్తీగా ఉండటంలో మనం డైలీ తినే ఆహారాలు కీలకపాత్ర పోషిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆ ఆహారాల్లో సీడ్స్ కూడా ఒక భాగం. ముఖ్యంగా ఈ ఏడు రకాల విత్తనాలను రోజువారీ డైట్‌లో చేర్చుకున్నారంటే ఎలాంటి ఆరోగ్య సమస్యలు మీ దరి చేరవంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవేంటో ఇప్పుడు చూద్దాం.

మనం ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనైనా చేయగలుగుతాం. మరి, అలాంటి సంపూర్ణ ఆరోగ్యం మన సొంతం కావాలంటే రోజూ సరైన పోషకాహారం తీసుకోవడం చాలా అవసరమంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ క్రమంలోనే ప్రతి ఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో ఈ సీడ్స్ తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచిస్తున్నారు. ఈ విత్తనాలు చూడడానికి పరిమాణంలో చిన్నవిగా కనిపించినా.. వీటిని తీసుకోవడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం బోలెడంటున్నారు. ఇంతకీ, ఆరోగ్య నిపుణులు సూచిస్తున్న ఆ సీడ్స్ ఏంటి? వాటి వల్ల కలిగే హెల్త్ బెనిఫిట్స్ ఏంటో తెలుసుకుందాం.

చియా సీడ్స్ :



ఇవి కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. వీటిలోనూ ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాలు, మెగ్నీషియం, జింక్, ఫైబర్ మెండుగా ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు, కాల్షియం చాలా ఎక్కువ. ఈ విత్తనాలు మీ డైట్‌లో చేర్చుకుంటే ఎముకలు, దంతాలు దృఢంగా మారడమే కాకుండా బరువు తగ్గడానికి సహాయపడతాయి. అలాగే హార్మోన్ల పనితీరును సమతౌల్యం చేసి రక్తపోటును నియంత్రించడంలో చాలా బాగా పనిచేస్తాయంటున్నారు నిపుణులు.

పొద్దుతిరుగుడు విత్తనాలు :

ఈ గింజలు ఆరోగ్యకరమైన కొవ్వులు, మాంసకృత్తులు, ఫైబర్, వివిధ ముఖ్యమైన ఖనిజాలతో నిండి ఉంటాయి. ముఖ్యంగా వీటిలో విటమిన్ E సమృద్ధిగా ఉంటుంది. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో చాలా ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. అలాగే చర్మానికి ఆరోగ్యాన్నిస్తాయి. బరువు నియంత్రణలో ఉండటానికి కూడా చాలా బాగా తోడ్పడతాయంటున్నారు నిపుణులు.



అవిసె గింజలు :

ఆరోగ్యంగా ఉండాలంటే మీ రోజువారి డైట్‌లో తప్పకుండా చేర్చుకోవాల్సిన సీడ్స్.. అవిసె గింజలు. వీటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్ పుష్కలంగా ఉంటాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్లతో 6 గ్రాముల ఫైబర్, 4 గ్రాముల ప్రోటీన్ పొందవచ్చంటున్నారు నిపుణులు. అంతేకాకుండా, వీటిల్లో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి హార్మోన్ల సమతుల్యతకు, కీళ్లు, హృదయ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. న్యూట్రిషన్ వ్యాల్యూ ఎండ్ హెల్త్ ఎఫెక్ట్స్ ఆఫ్ ఫ్లాక్స్ సీడ్(2017)లో జరిపిన అధ్యయనం ప్రకారం.. వీటిలో ఉండే ఫైబర్, లిగ్నాన్స్, ఒమేగా3లు గుండె ఆరోగ్యం, క్యాన్సర్ ప్రమాద తగ్గింపు, మెరుగైన జీర్ణక్రియ కోసం చాలా బాగా సహాయపడతాయని వెల్లడైంది.





గుమ్మడికాయ గింజలు :

ఈ సీడ్స్‌ను మీ డైలీ డైట్‌లో చేర్చుకోవడం ద్వారా బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చంటున్నారు నిపుణులు. వీటిలో ఐరన్, పీచు, ఆరోగ్యకరమైన కొవ్వులు, అమైనో ఆమ్లాలు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, మెగ్నీషియం, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అదనంగా ఈ గింజలు యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి బరువు నిర్వహణలో సహాయపడడమే కాకుండా మూత్రాశయ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం.. గుమ్మడికాయ గింజలు తినడం వల్ల క్యాన్సర్ రాకుండా నిరోధించవచ్చంట.



నువ్వులు :

ఈ సీడ్స్ మీ డైట్‌లో చేర్చుకోవడం ద్వారా ఎన్నో బెనిఫిట్స్ పొందవచ్చంటున్నారు నిపుణులు. వీటిలో కాల్షియం, రాగి, ఫైబర్, మెగ్నీషియం, ఇనుము, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గించడం నుంచి ఆరోగ్యకరమైన ఎముకలకు మద్దతు ఇవ్వడం, మంటను తగ్గించడం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

దానిమ్మ గింజలు :

వీటిలో ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో చాలా బాగా సహాయపడతాయంటున్నారు నిపుణులు. అలాగే ఈ గింజలలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు మంటను తగ్గించడంలో చాలా ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయని చెబుతున్నారు. చూశారుగా.. చిన్న పరిమాణంలో ఉండే సీడ్స్‌తో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో.. మరి, ఇంకెందుకు ఆలస్యం ఇప్పటి నుంచే మీ డైట్‌లో వీటిని భాగం చేసుకోండని నిపుణులు సలహా ఇస్తున్నారు.





తులసి గింజలు :

ఇవి కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. చియా గింజల మాదిరిగానే ఇవి ప్రొటీన్, అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ఫైబర్‌తో నిండి ఉంటాయి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే తులసి గింజలు జీర్ణక్రియకు దోహదపడతాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా రక్తంలో చక్కెర నియంత్రణలో సహాయపడతాయి. ఒక స్పూన్ తులసి విత్తనాలను గోరువెచ్చని నీటిలో వేసి ఐదు నిమిషాలు నానబెట్టి తాగితే సరి.





వంటల్లో ఈ నూనెలు వాడటం ఉత్తమం!

చాలా మంది సరైన పద్ధతిలో వంట చేయడం వల్ల అనారోగ్యాలను కొని తెచ్చుకుంటుంటారు. మార్కెట్లో వంట నూనెల అధిక ధరల దృష్ట్యా ఏదో ఒక చవక నూనెను కొని ఇంటికి తెచ్చుకొని, వాటితో వంటకాలు చేసుకొని తినడం వల్ల రోగాలు చుట్టుముడతాయి. అయితే ఏ నూనె ఆరోగ్యానికి మంచిదనే విషయంలో చాలా మందికి క్లారిటీ లేదు. ఆవనూనె మంచిదని కొందరు, తెల్లనూనె అని మరి కొందరు, నెయ్యి అని ఇంకొందరు సలహా ఇస్తుంటారు.



పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆహారం నుంచి నూనెను పూర్తిగా తొలగించడం మంచిది కాదు. మీరు నివసించే ప్రాంతంలో సహజంగా లభించే నూనె మీ ఆరోగ్యానికి ఉత్తమమైనదని నిపుణులు అంటున్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నాణ్యమైన నూనె వాడాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆలివ్ ఆయిల్‌లో కేలరీలను తగ్గించడంలో సహాయపడుతుంది. నిజానికి, ఆలివ్ ఆయిల్ తక్కువ స్మోకింగ్ పాయింట్ కలిగి ఉంటుంది. కాబట్టి వేపుళ్లకు ఇది ఉత్తమమైన నూనె. ఇందులో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్యాటీ యాసిడ్స్ వంటి పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి.

దక్షిణ భారతదేశంలో కొబ్బరి నూనెను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ నూనెలో మీడియం చైన్ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇది శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే, కొబ్బరి నూనెను ఎక్కువగా వాడడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు.



నువ్వుల నూనె కూడా ఆరోగ్యానికి మంచిది. ఈ నూనె చెడు కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. అయితే నువ్వుల నూనెను ఎక్కువ పరిమాణంలో వాడకూడదు. ఆవనూనెలో వంట చేయడం భారతీయులకు తమ పూర్తికుల కాలం నుంచి అలవాటు. ఈ నూనెలో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఆవాల నూనె జీవక్రియ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి ఆవనూనె సందేహం లేకుండా తినవచ్చు.



అవకాడో ఆయిల్, బాదంసీడ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ కూడా ఆరోగ్యానికి ఉత్తమమైనవి. వీటిలో మోనోఅన్‌శాచురేటెడ్, ఒలీక్ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి బరువు తగ్గించడంలో సహాయపడతాయి. ఏ నూనె అయినా మితంగా తింటే ఆరోగ్యానికి మంచిది. అదరంగా అధిక నూనె తినడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు బదులుగా వివిధ ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

శనివారం

జూలై-18-2026

సంపుటి (Volume) : 2

సంచిక (Issue) 190

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 4

సంగారెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ డ్రైవ్

సంగారెడ్డి : జూలై 17 (సిరి న్యూస్)
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ బి వి స్కిల్లింగ్ ఫౌండేషన్, ఐ ఐ టి హెచ్ మరియు కళాశాల టీఎస్ కేసి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఐఐటి హెచ్ లో ఉపాధి అవకాశాల కోసం జాబ్ డ్రైవ్ నిర్వహించారు.



2



నవ్వుల పాలవుతున్న నాలుగో స్తంభం!

మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలపై ఏళ్లుగా అశ్రద్ధ

- మెదక్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల మనుగడకే పొంచి ఉన్న ముప్పు
- రెండేళ్లు గడుస్తున్నా ప్రెస్ క్లబ్ ఎన్నికల ఊసే ఎత్తని వైనం
- సమాజంలో తప్పులను ఎత్తిచూపే విలేకరులు సొంత సమస్యలను తీర్చుకోలేని దీనస్థితి

సమస్యల వలయంలో విలేకరులు

- పేరుకే ప్రెస్ క్లబ్.. అంతా బయటి వ్యక్తుల పెత్తనమే
- నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుతున్న భవనం..
- వార్తలు రాయాలంటే విపరీతమైన ఒత్తిళ్లు..
- బయటి వారి వార్నింగులతో ఆత్మవిశ్వాసానికి దెబ్బ
- సీనియర్లు, యూనియన్ నేతల మౌనంపై మెదక్ జర్నలిస్టుల ఆవేదన

3

సమాజంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలిచే 'ఫోర్త్ ఎస్టేట్' మెదక్ జిల్లా కేంద్రంలో ఇప్పుడు నవ్వుల పాలు అవుతోంది. సమాజంలో ఎక్కడైనా కాలపరిమితి ముగిసి ఎన్నికలు జరపకపోతే పేజీలకు పేజీలు వార్తలు రాసే విలేకరులు.. నేడు తమ సొంత ఇంటి సమస్యను మాత్రం పరిష్కరించుకోలేక పోతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. మెదక్ ప్రెస్ క్లబ్ కమిటీ కాలపరిమితి ముగిసి ఏండ్లు గడుస్తున్నా.. ఇంతవరకు నూతన కార్యవర్గ ఎన్నికల ఊసే ఎత్తకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గతంలో అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో ఆ పదవి ఖాళీ అయింది. అయినా కొత్త కమిటీని ఎన్నుకోవడంలో చూపుతున్న అశ్రద్ధ జర్నలిస్టుల ఐక్యతను ప్రశ్నార్థకం చేస్తోంది.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)



ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి

- ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలి
- ఆటోల కోసం ప్రత్యేక స్టాండ్ల ఏర్పాటు చేయాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో సుదీర్ఘ చర్చ

2

సంగారెడ్డి, జూలై 17 (సిరి న్యూస్): సంగారెడ్డి పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ శుక్రవారం పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణంలోని చౌరస్తా, ఓల్డ్ బస్ స్టాండ్, బైపాస్ రోడ్డు, సాయిబాబా కమాన్ వంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎస్పీ ఈ ప్రణాళికలను సిద్ధం చేశారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను వెంటనే వెనక్కి తరలించాలని లేదా ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.



ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి

- ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలి
- ఆటోల కోసం ప్రత్యేక స్టాండ్లు ఏర్పాటు చేయాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో సుదీర్ఘ చర్చ


సంగారెడ్డి, జూలై 17 (సిరి న్యూస్): సంగారెడ్డి పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ శుక్రవారం పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణంలోని చౌరస్తా, ఓల్డ్ బస్ స్టాండ్, బైపాస్ రోడ్డు, సాయిబాబా కమాన్ వంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎస్పీ ఈ ప్రణాళికలను సిద్ధం చేశారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను వెంటనే వెనక్కి తరలించాలని లేదా ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న ఆటోల కోసం ప్రత్యేక స్టాండ్లను ఏర్పాటు చేయాలని, వాహనాల క్రమబద్ధీకరణ కోసం బొల్లార్డ్స్‌ను అమర్చాలని సూచించారు. పాదచారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆక్రమణలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కేవలం నిబంధనల అమలు మాత్రమే కాకుండా, ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని పోలీసులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే సంగారెడ్డిని ట్రాఫిక్ రహిత పట్టణంగా మార్చగలమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, ఆర్డీఓ రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. తీసుకున్న నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు.



సంగారెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ డ్రైవ్

సంగారెడ్డి : జూలై 17 (సిరి న్యూస్)
ప్రభుత్వ మహి ళా డిగ్రీ కళాశాలలో ఎన్ బి వి స్కిల్లింగ్ ఫౌండేషన్, ఐ ఐ టి హెచ్ మరియు కళాశాల టీఎస్ కేసి విభాగం సం యుక్త ఆధ్వర్యంలో ఐఐటిహెచ్ లో ఉపాధి అవకాశాల కోసం జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌కు సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి సుమారు 145 మంది నిరు ద్యోగ అభ్యర్థులు హాజరై ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అరుణ బా యి మాట్లాడుతూ, వివిధ సంస్థలు నిర్వహించే జాబ్ డ్రైవ్ లు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను అందిపు చ్చుకునేందుకు మంచి వేదికలని పేర్కొన్నారు. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల టీ ఎస్ కె సి కోఆర్డినేటర్ డాక్టర్ క స్తూరి, ఐక్యూ ఏ సి కోఆర్డినేటర్ వరలక్ష్మి, ఏబివి స్కిల్లింగ్ ఫౌండేషన్ సిఓఓ రాజబలి, ఫౌండేషన్ మేనేజర్ శేఖర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ఐఐటీ హెచ్ -ఎన్ బీవీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని జాబ్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించారు.





నవ్వుల పాలవుతున్న నాలుగో స్తంభం!

మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలపై ఏళ్లుగా అశ్రద్ధ

- సమస్యల వలయంలో విలేకరులు..
- మెదక్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల మనుగడకే పొంచి ఉన్న ముప్పు
- రెండేళ్లు గడుస్తున్నా ప్రెస్ క్లబ్ ఎన్నికల ఊసే ఎత్తని వైనం
- సమాజంలో తప్పులను ఎత్తిచూపే విలేకరులు సొంత సమస్యలను తీర్చుకోలేని దీనస్థితి
- పేరుకే ప్రెస్ క్లబ్.. అంతా బయటి వ్యక్తుల పెత్తనమే
- నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుతున్న భవనం..
- వార్తలు రాయాలంటే విపరీతమైన ఒత్తిళ్లు..
- బయటి వారి వార్నింగులతో ఆత్మవిశ్వాసానికి దెబ్బ
- సీనియర్లు, యూనియన్ నేతల మౌనంపై మెదక్ జర్నలిస్టుల ఆవేదన





సమాజంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలిచే 'ఫోర్త్ ఎస్టేట్' మెదక్ జిల్లా కేంద్రంలో ఇప్పుడు నవ్వుల పాలు అవుతోంది. సమాజంలో ఎక్కడైనా కాలపరిమితి ముగిసి ఎన్నికలు జర పకపోతే పేజీలకు పేజీలు వార్తలు రాసే విలేక రులు.. నేడు తమ సొంత ఇంటి సమస్యను మాత్రం పరిష్కరించుకోలేక పోతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. మెదక్ ప్రెస్ క్లబ్ కమిటీ కాలపరిమితి ముగిసి ఏండ్లు గడుస్తున్నా.. ఇంతవరకు నూతన కార్యవర్గ ఎన్నికల ఊసే ఎత్తకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గతంలో అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో ఆ పదవి ఖాళీ అయింది. అయినా కొత్త కమిటీని ఎన్నుకోవడంలో చూపుతున్న అశ్రద్ధ జర్నలిస్టుల ఐక్యతను ప్రశ్నార్థకం చేస్తోంది.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్):

ఇప్పటికైనా మేల్కోవాలి..

ఇలాగే చోద్యం చూస్తూ కూర్చుంటే ముమ్ముందు మెదక్‌లో జర్నలిస్టుల మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. తమ హక్కులను తామే కాపాడుకోలేని వారు, సమాజంలోని ఇతర వర్గాల సమస్యలపై ఎలా పోరాడుతారనే అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులంతా ఏకం కావాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత విభేదాలను, గ్రూపు రాజకీయాలను పక్కనబెట్టి, తక్షణమే ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి. ముందు తమ ఇల్లు చక్కదిద్దుకుని, ఆపై సమాజాన్ని చక్కదిద్దేందుకు ధైర్యంగా ముందుకు రావాలని తోటి జర్నలిస్టులు పిలుపునిస్తున్నారు.







ఘనమైన చరిత్ర.. నేటి దుస్థితి..



ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎందరో జర్నలిస్టులు గతంలో రాష్ట్ర స్థాయి యూనియన్ నాయకులుగా చక్రం తిప్పారు. ఇక్కడి నుండి పనిచేసిన సోలిపేట రామలింగారెడ్డి ఎమ్మెల్యే గా, ఆర్. సత్యనారాయణ ఎమ్మెల్సీగా రాజకీయంగా అత్యున్నత పదవులను అధిరోహించిన ఘనమైన చరిత్ర ఈ గడ్డకు ఉంది. అలాంటి గొప్ప జిల్లా కేంద్రంలో నేడు జర్నలిస్టుల కనీస సాధకబాధకాలు చర్చించుకునే నాథుడే కరువయ్యాడు. క్షేత్ర స్థాయిలో రాత్రింబవళ్లు శ్రమి స్తున్న విలేకరులకు కనీసం వారి పిల్లల స్కూల్ ఫీజుల్లో రాయితీలు కూడా దక్కక ఆర్థికంగా విలవిలలాడుతున్నారు. పేరుకే అది జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ కానీ.. లోపల అంతా బయటి వ్యక్తుల అజమాయిషీ, పెత్తనమే నడుస్తోందని స్థానిక జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హక్కుల కోసం పోరాడే సీనియర్ జర్నలిస్టులు ఎక్కడ?

మెదక్ జిల్లాలో ప్రస్తుతం విలేకరులు ఒక వాస్తవాన్ని వెలుగులోకి తెస్తూ ధైర్యంగా వార్త రాయాలంటే ఎన్నో రాజకీయ, సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. నిజాయితీగా పనిచేసే విలేకరులపై ఎవరెవరో వస్తూ వార్నింగ్‌లు ఇస్తూ, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సీనియర్ జర్నలిస్టులు ఎక్కడ? ఎన్నో ఏళ్లుగా హక్కులంటూ పోరాడే యూనియన్ నాయకులు ఎక్కడ? మీ ఐక్యత ఏమైంది? అని జర్నలిస్టు లోకం ప్రశ్నిస్తోంది. ఇలాగే చోద్యం చూస్తూ కూర్చుంటే ముమ్ముందు మెదక్‌లో జర్నలిస్టుల మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని, 'పోరాడితే పోయేది బానిస సంకెళ్లు' అనే నినాదంతో ఇప్పటికైనా మేల్కొని ముందు తమ ఇల్లు చక్కదిద్దుకుని ఆపై సమాజాన్ని చక్కదిద్దేందుకు ముందుకు రావాలని తోటి జర్నలిస్టులు పిలుపునిస్తున్నారు.

శిథిలావస్థకు ప్రెస్ క్లబ్ భవనం



గతంలో ఎంతో మంది జర్నలిస్టులు కష్టపడి, శ్రమించి నిర్మించుకున్న ప్రెస్ క్లబ్ భవనం ఇప్పుడు ఎందుకు ఉపయోగపడుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కనీసం జర్నలిస్టులంతా కలిసి ఒక సాధారణ సమావేశం పెట్టుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. నాయకుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉంది. ఇప్పటికే భవనం వెలుపల ఉన్న స్టీల్ రేలింగ్స్ దాదాపు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా జిల్లా జర్నలిస్టులు స్పందించకపోతే.. ఉన్న ఆ కాస్త ఆస్తి కూడా చేజారిపోయే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

